


కావురమ్మకు ప్రత్యేక పూజలు

రేపల్లె రూరల్: చెరుకుపల్లి మండలం కావూరులోని కావురమ్మ తల్లి తిరునాళ్ల గురువారం వైభవంగా జరిగింది. వైఎస్సార్‌సీపీ నేత డాక్టర్ ఈవూరి గణేష్ ప్రత్యేక పూజలు చేశారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 514.60 అడుగుల వద్ద ఉంది. ఇది 139.6134 టీఎంసీలకు సమానం.

ఘనంగా లక్ష్మీగణపతి ఆలయ వార్షికోత్సవం



నాదెండ్ల: గణపవరం–నాదెండ్ల డొంకరోడ్డులోని శ్రీ లక్ష్మీ గణపతి దేవస్థానం నాలుగో వార్షికోత్సవం వైభవంగా జరిగింది. స్వామివారికి అర్చనలు, అభిషేకాలు చేశారు.

న్యూస్‌రీల్

బొప్పూడి ఆలయంలో సీతారామ కళ్యాణం



చిలకలూరిపేట: బొప్పూడి గ్రామం డొంక వద్ద జాతీయ రహదారి పక్కన వేంచేసియున్న శ్రీప్రసన్నాంజనేయస్వామి దేవాలయ 42వ వార్షికోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా గురువారం ఆలయ ప్రాంగణంలో సీతారామ కళ్యాణ మహోత్సవం కనుల పండువగా నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు అధిక సంఖ్యలో పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు మురికిపూడి సంతోష్ చరణ్ దివి పవన్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి, భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఈ పూజా కార్యక్రమంలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఐఎఫ్‌సీ బృందం క్షేత్ర సందర్శన



అమరావతి: మండలంలోని పలు గ్రామాలలో గురువారం అంతర్జాతీయ ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఎఫ్‌సీ) ప్రతినిధుల బృందం రైతులతో వ్యవసాయ క్షేత్ర సందర్శన, గ్రామసభలు నిర్వహించారు. తొలుత ఈ బృందం దిడుగు గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామసభ నిర్వహించి మిర్చి రైతులను మిర్చి ఉత్పత్తి, మార్కెటింగ్ గురించి అడిగి తెలుసుకున్నారు అత్తలూరులో నిర్వహించిన వ్యవసాయక్షేత్ర సందర్శనలో మొక్కజొన్న రైతులతో మాట్లాడారు. అనంతరం స్వయం సహాయక మహిళాసంఘాల సభ్యులు, రైతులతో ఆర్థిక అంశాలపై చర్చించారు.ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌సీ బృంద సభ్యులు కె. విజయశేఖర్, హేమేంద్ర మెహర్, యువరాజ్ అహూజా, నవనీత్‌రాయ్, షెనాయ్ మ్యాథ్యు, ఇషాసర్, సీతల్ సోమనిలతో పాటు ఉద్యానవన శాఖ డీపీఎం అమలకుమారి, మండల, వ్యవసాయశాఖాధికారి అహ్మద్, ఉద్యాన అధికారి శ్రీనిత్య, అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

జిల్లా ప్రధాన న్యాయమూర్తిని కలిసిన నగర కమిషనర్



నెహ్రూనగర్ (గుంటూరు ఈస్ట్): గుంటూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు తీసుకున్న బి.సాయి కళ్యాణ్ చక్రవర్తిని గురువారం జిల్లా కోర్టులోని ఆయన కార్యాలయంలో నగర కమిషనర్ పులి శ్రీనివాసులు మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందించి శుభాకాంక్షలు తెలిపారు.

కొండపాటూరు పోలేరమ్మకు రూ. 22.46 లక్షల ఆదాయం



ప్రత్తిపాడు: కాకుమాను మండలం కొండపాటూరు పోలేరమ్మకు తిరునాళ్ల సందర్భంగా రూ. 22.46 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో బత్తుల సురేష్‌బాబు తెలిపారు. భక్తులు పోలేరమ్మ తల్లికి సమర్పించిన కానుకలు, హుండీలను తెరిచి ఆలయంలో గురువారం లెక్కించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ పాటల ద్వారా రూ. 3.90 లక్షలు, హుండీల ద్వారా 12.76 లక్షలు, టిక్కెట్ల ద్వారా 2.40 లక్షలు, చందాల రూపంలో రూ. 39 వేలు, లడ్డూ ప్రసాద విక్రయాల ద్వారా రూ. 3 లక్షలు చొప్పున మొత్తం 22,46,256 రూపాయల ఆదాయం వచ్చినట్లు చెప్పారు. లెక్కింపు కార్యక్రమాన్ని దేవదాయశాఖ బాపట్ల ఇన్‌స్పెక్టర్ ఎం.గోపి, ఈవో బి. సురేష్‌లు పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఆలయ పూజారి ముప్పా రామచంద్రావు, గ్రామపెద్దలు యర్రాకుల దానయ్య, పి. శ్రీనివాసరావు, ఉత్సవకమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేటి కౌన్సిల్ సమావేశం వాయిదా

నెహ్రూనగర్(గుంటూరుఈస్ట్): ఈ నెల 25వ తేదీన జరగాల్సిన నగర పాలక సంస్థ సాధారణ కౌన్సిల్ సమావేశం వాయిదా పడింది. ఈ నెల 28న మేయర్ ఎన్నిక జరగనున్న నేపథ్యంలో ఈ సమావేశాన్ని వాయిదా వేసినట్లు తెలిసింది.

యానిమేషన్ మాయలో ఏజెంట్లే కీలకం

- పెట్టుబడులు పెట్టించడానికి ప్రత్యేకంగా నియామకం
- ఒక్కొక్కటిగా బయటపడుతున్న లీలలు
- 30 శాతం కమీషన్ ముట్టజెప్పడంతో అధిక మొత్తంలో పెట్టుబడులు
- గుంటూరు కేంద్రంగా యానిమేషన్ ఏజెంట్ భారీగా పెట్టుబడుల సేకరణ
- రోజు రోజుకు పెరుగుతున్న బాధితుల సంఖ్య
- కుంభకోణంపై కేసులు... మాకు సంబంధం లేదంటున్న పోలీసులు



వీడియో సందేశం ఇస్తున్న యానిమేషన్ నిర్వాహకుడు కిరణ్

సాక్షి, నరసరావుపేట, నరసరావుపేటటౌన్: యానిమేషన్ మాయలో ఏజెంట్ల పాత్ర కీలకంగా కనిపిస్తోంది. రూపాయి పెట్టుబడి పెడితే రెట్టింపు రాబడి అంటూ ప్రచారంతో రూ.వందల కోట్లు వసూల్ చేసి బోర్డు తిప్పేసిన యానిమేషన్ స్కాం లీలలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. స్థోమతకు మించి పెట్టుబడి పెట్టిన డబ్బులు తిరిగిరావని మనోవేదనకు గురై నరసరావుపేటకు చెందిన గుండా నాగేశ్వరరావు గుండెపోటుతో మృతి చెందిన విషయం తెలిసిందే. పెద్ద మొత్తంలో బాధితుల చేత పెట్టుబడి పెట్టించడానికి యానిమేషన్ సంస్థ ప్రత్యేకంగా ఏజెంట్ల నియామకం చేసినట్టు తెలుస్తోంది. విజయవాడ కేంద్రంగా సాగిన యానిమేషన్ స్కాంలో గుంటూరు వాసిది కీలకమని తెలుస్తోంది. ఆయన ఏజెంట్‌గా అవతారమెత్తి బడా వ్యాపారుల చేత దగ్గరుండి పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెట్టించాడట. ప్రధాన సూత్రధారి కిరణ్ అజ్ఞాతంలోకి వెళ్లడంతో పెట్టుబడి దారుల నుంచి ఒత్తిడి పెరిగింది. పెట్టుబడి పెట్టే సమయంలో అంతా తనదే బాధ్యత అన్న గుంటూరు ఏజెంట్ నేడు నాకే సంబంధం అంటూ బుకాయిస్తున్నాడు. దీంతో అతను చేసిన మోసంపై బాధితులు నరసరావుపేట పోలీసులను ఆశ్రయించేందుకు సిద్ధమయ్యారు.

చివరి వరకు వంచన...

గత ఏడాది చివరిలో గడువు పూర్తి అయ్యి పెట్టుబడితో పాటు లాభం నగదు చాలమందికి చేతికి అందాలి. అయితే గత ఏడునెలలుగా చెల్లింపులు పూర్తిగా నిలిచిపోయాయి. సాంకేతిక కారణాల వల్ల నగదు ఆగిపోయిందని, వచ్చే నెలలో వస్తాయంటూ ప్రతిసారి కిరణ్ చెప్పుకొచ్చాడు. అయినప్పటికి డిసెంబర్, జనవరి మాసాల్లో సైతం పెట్టుబడి ద్వారా పెద్ద మొత్తంలో నగదు సమకూర్చుకున్నాడు. ఫిబ్రవరి నెల నుంచి ఫోన్లు స్విచ్ ఆఫ్ చేయడం మొదలుపెట్టాడు. దీంతో బాధితులంతా విజయవాడలోని కార్యాలయానికి వెళ్లి ఒత్తిడి తెచ్చారు. బాధితుల నుంచి ఒత్తిడి పెరగడంతో చివరకు తమిళనాడు వెళ్లి తలదాచుకున్నాడు. అక్కడి నుంచి బాధితులకు డబ్బు విషయంలో ఆధైర్యపడవద్దంటూ వీడియో సందేశాలను విడుదల చేశాడు.

ఒక్కొక్కరుగా బయటపడుతున్న బాధితులు...

గుండా నాగేశ్వరరావు మృతి తరువాత బాధితులు ఒక్కొక్కరు బయటకు వస్తున్నారు. మొదట రూ.400 కోట్లు అనుకున్న బాధితులు రోజురోజుకు పెరుగుతున్నారు. బాధితులు ఒకరికి తెలియకుండా ఒకరు నేరుగా ఏజెంట్, కిరణ్‌లకు నగదు చెల్లించారు. ఇందులో కొందరు మాజీ పోలీసు అధికారులు, నరసరావుపేటకు చెందిన మహిళలు కూడా ఉండటం గమనర్హం. బుధవారం విజయవాడలోని సత్యనారాయణపురం పోలీసుస్టేషన్‌లో నరసరావుపేటకు చెందిన టి. శ్రీనివాసరావు, కె దిలిప్‌కుమార్‌లు తాము సుమారు రూ.16 కోట్లు చెల్లించి మోసపోయామని కిరణ్‌పై ఫిర్యాదు చేశారు.

మాకేం సంబంధం లేదు...!

పోలీస్ స్టేషన్ మెట్లు ఎక్కితే తమకు న్యాయం జరుగుతుందేమోనని కొందరు భావించినా మొదట్లోనే వారి ఆశలపై నీళ్ల చల్లినట్టయింది. కొందరు పోలీసు అధికారులను బాధితులు కలసి తాము డబ్బులు చెల్లించి నిండా మునిగామని చెప్పి చెప్పక ముందే యానిమేషన్ కార్యాలయం విజయవాడలో ఉన్న కారణంగా తమ పరిధి కాదని, అక్కడికి వెళ్లి ఫిర్యాదు చేయాలని సలహా ఇస్తున్నారు. ఇక ప్రభుత్వ విషయానికొస్తే గత నాలుగు రోజులుగా పత్రికల్లో యానిమేషన్ స్కాంపై కథనాలు వస్తున్నప్పటికి కనీస స్పందన లేదు. జరిగిన ఆర్థిక నేరంపై ప్రత్యేక దర్యాప్తు సంస్థను నియమించి న్యాయం జరిగేలా కృషి చేయాలని బాధితులు కోరుతున్నారు.

30 శాతం కమీషన్...

యాపిక్స్ అనే యానిమేషన్ కంపెనీలో పెట్టుబడులు పెట్టించినందుకు గుంటూరుకు చెందిన రాజు అనే ఏజెంట్‌కు పెద్ద మొత్తంలో కమీషన్ ముట్టినట్టు బాధితులు తెలుపుతున్నారు. నరసరావుపేటకు చెందిన పొగాకు వ్యాపారి అతనికి బంధువు కావడంతో నమ్మి సుమారు రూ.50 కోట్ల వరకు పెట్టుబడి పెట్టాడు. విషయం తెలుసుకొన్న మరో బంగారం వ్యాపారి రూ.20 కోట్ల వరకు యానిమేషన్‌లో పెట్టుబడి పెట్టారు. వీరితో పాటు మరి కొందరు సుమారు రూ.30 కోట్ల వరకు రాజు ఆధ్వర్యంలో చెల్లించారు. అంతా తనదే బాధ్యతని, మీ డబ్బుకు నాది గ్యారెంటీ అంటూ నమ్మబలికి గుంటూరు కార్యాలయ కేంద్రంగా పెట్టుబడులు సేకరించారు. నగదులో 30 శాతం కమీషన్ రాజు మినహాయించుకొని మిగిలిన డబ్బులు సంస్థ యజమాని కిరణ్‌కు అప్పగించేవాడని బాధితులు చెప్పుకొస్తున్నారు. తీరా కిరణ్ పరారవ్వడంతో కమీషన్ కోసం ఏజెంట్ తమను ముంచాడని బాధితులు వాపోతున్నారు.

ఆసుపత్రులకు ఫైర్ నిబంధనలను సవరించండి

ఫైర్ డీజీకి ఐఎంఏ విజ్ఞప్తి



డీజీ మాదిరెడ్డి ప్రతాప్‌ను కలిసిన డాక్టర్ జి.నంద కిషోర్, డాక్టర్ టి.సేవకుమార్, ఐఎంఏ సభ్యులు

గుంటూరు మెడికల్: రాష్ట్రంలో క్లినిక్స్, చిన్న, మధ్య తరహా ఆసుపత్రులకు రిజిస్ట్రేషన్ విషయంలో ఫైర్ ఎన్‌ఓసీ చాలా సమస్యగా ఉందని, ఫైర్ నిబంధనలను కొన్ని సవరించాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) రాష్ట్ర శాఖ ఫైర్ సర్వీసెస్ డైరెక్టర్ జనరల్ మాదిరెడ్డి ప్రతాప్‌ను కోరింది. విజయవాడలోని ఫైర్ సర్వీసెస్ కార్యాలయంలో ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జి.నందకిషోర్ ఆధ్వర్యంలో గురువారం మాదిరెడ్డి ప్రతాప్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. 'నేషనల్ ఫైర్ సేఫ్టీ వీక్' సందర్భంగా ఐఎంఏ అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా వైద్యులకు జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జి. నంద కిషోర్, ఐఎంఏ ఫైర్ సేఫ్టీ కమిటీ చైర్మన్ డాక్టర్ సి.శ్రీనివాస రాజు, ఫైర్ ఎన్‌ఓసీ విషయంలో ఎదురవుతున్న సమస్యలను డీజీ దృష్టికి తీసుకువెళ్లారు. క్లినిక్స్, చిన్న, మధ్య తరహా ఆసుపత్రుల్లో సైతం భారీ అగ్నిమాపక పరికరాలు అమర్చుకోవాలనడం ఎంత మాత్రం సమంజసం కాదన్నారు. వీటివల్ల ఆర్థిక భారం తప్ప ఏమాత్రం ప్రయోజనం లేదన్నారు. డీజీ ఫైర్ సర్వీసెస్ మాదిరెడ్డి ప్రతాప్ మాట్లాడుతూ వైద్యులు ఫైర్ ఎన్‌ఓసీ విషయంలో ఎదుర్కొంటున్న సమస్యలన్నిటినీ ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి తప్పక కృషి చేస్తానన్నారు. డీజీని కలిసిన వారిలో ఐఎంఏ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ మోటూరు సుభాష్ చంద్రబోస్, ఐఎంఏ జాతీయ యాక్షన్ కమిటీ సభ్యులు డాక్టర్ పి. ఫణిధర్, కోశాధికారి డాక్టర్ టి.కార్తీక్, సంయుక్త కార్యదర్శి డాక్టర్ టి.సేవకుమార్, డాక్టర్ డి.అమరలింగేశ్వర రావు తదితరులు ఉన్నారు.

ముగిసిన సలహా మండలి సమావేశం



సమావేశంలో పాల్గొన్న శాస్త్రవేత్తలు, అధికారులు

గుంటూరు రూరల్: నగర శివారుల్లోని లాంఫాం వ్యవసాయ పరిశోధన స్థానం నందు గత రెండు రోజులుగా జరుగుతున్న వ్యవసాయ పరిశోధన, విస్తరణ సలహా మండలి సమావేశం గురువారంతో ముగిసింది. సమావేశంలో ఆయా పంటల ప్రధాన శాస్త్రవేత్తలు పంటల్లో పరిశోధనలు, సాధించిన ప్రగతి, నూతన టెక్నాలజీ, మినీకిట్లు వంటి అంశాలపై చర్చించి సమాచారాన్ని అందించారు. యాంత్రీకరణపై శాస్త్రవేత్తలతో ప్రత్యేక చర్చా కార్యక్రమం , గెస్ట్ లెక్చర్ నిర్వహించారు. వరి పంటలో బీపీటీ 5204 నాణ్యత కలిగిన సన్నగింజ రకాలు ఎగుమతికి అనువైనవని, 7 మిల్లీ మీటర్ల గింజ పొడవుగల వరి రకాలు, కలర్డ్ వరి రకాలపై పరిశోధనలు చేయాలని, అధిక దిగుబడిని ఇచ్చే తక్కువ ఎత్తు గల మొక్క జొన్న, జొన్న, హైబ్రిడ్స్ అపరాలలో కలుపు యాజమాన్యం, శనగలో పోస్ట్ ఎమర్జెన్స్ కలుపు మందులు, కాండం తొలిచే పురుగులు, గజ్జి తెగులు యాజమాన్యం, తెగుళ్లను తట్టుకునే మినుము రకాలపై పరిశోధనలు చేపట్టాలని పరిశోధన సంచాలకులు డాక్టర్ పీవీ సత్యనారాయణ తెలిపారు. పత్తిలో గులాబీ రంగు పురుగు యాజమాన్యంపై, ట్రాష్ షెడ్డర్ ద్వారా పంట వ్యర్థాల వినియోగం వటి అంశాలపై రైతులకు అవగాహన పెంచాలని విస్తరణ సంచాలకులు డాక్టర్ జి. శివన్నారాయణ తెలిపారు. చెరకు విస్తీర్ణం క్రమేపీ తగ్గిపోతున్న సందర్భంగా డ్రయ్యర్‌లు రైతులకు అందుబాటులో ఉంచాలని తెలిపారు. చెరకులో యాంత్రీకరణను పెంచి కూలీల ఖర్చు తగ్గించినపుడే పంటలో ఆశించిన లాభం వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఆయా జిల్లాల వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు, అభ్యుదయ రైతులు తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించండి

- అధికారులను ఆదేశించిన డీఆర్‌ఓ మురళి
- నేడు ఏడు కేంద్రాల్లో జరగనున్న ఏపీఆర్‌ఎస్ కాట్, ఏపీఆర్‌జేసీ, డీసీ సెట్



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌ఓ మురళి

నరసరావుపేట: జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని ఏడు సెంటర్లలో శుక్రవారం నిర్వహించనున్న ఏపీఆర్‌ఎస్ కాట్, ఏపీఆర్‌జేసీ, డీసీ సెట్ పరీక్షలకు 2,650మంది విద్యార్థులు హాజరవుతున్నందున పరీక్షా కేంద్రాల్లో కావాల్సిన మౌలిక వసతులు కల్పించాలని డీఆర్‌ఓ ఏకా మురళి పేర్కొన్నారు. గురువారం జరగబోయే పరీక్షలపై కలెక్టర్ కార్యాలయంలో సంబంధిత అధికారులతో కో-ఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. డీఆర్‌ఓ మాట్లాడుతూ 5,6,7,8 తరగతుల్లో ప్రవేశానికి ఏపీఆర్‌ఎస్ కాట్, ఇంటర్, డిగ్రీలలో ప్రవేశానికి ఏపీఆర్‌జేసీ, డీసీ సెట్‌ను ఉదయం 10 గంటల నుంచి 12గంటలు, మధ్యాహ్నం 2.30గంటల నుంచి 5గంటల వరకు నిర్వహించటం జరుగుతుందన్నారు. తాగు నీరు, విద్యుత్, వైద్యసౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. డీఈఓ ఎల్.చంద్రకళ, డీసీఓ ఎస్.సరోజిని, ఆర్డీఓ కె.మధులత, ఆర్టీసీ, పోలీసు, హెల్త్ డిపార్టుమెంట్ అధికారులు పాల్గొన్నారు.

'సాక్షి'పై దాడి హేయమైన చర్య



కలెక్టర్ కార్యాలయంలో డీఆర్‌ఓ మురళికి వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు, సీపీఐ, ఎంఐఎం, ఎంసీపీఐయూ, ప్రజాసంఘాల నాయకులు



స్టేషన్ రోడ్డులోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న జర్నలిస్టులు, ప్రజాసంఘాల నాయకులు

- దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌పై చర్యలు తీసుకోవాలి
- నరసరావుపేటలో జర్నలిస్టులు, సీపీఐ, ఎంసీపీఐయూ, ఎంఐఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ధర్నా
- జిల్లా ఎస్పీ, డీఆర్‌ఓలకు వినతిపత్రాలు

నరసరావుపేట: ఏలూరులో సాక్షి పత్రికా కార్యాలయంపై దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, అతని అనుచరుల దాడి ప్రజాస్వామ్య స్ఫూర్తికే గొడ్డలిపెట్టులాంటిదని జర్నలిస్టు, ప్రజాసంఘాలు, సీపీఐ, ఎంసీపీఐయూ, ఎంఐఎం నాయకులు పేర్కొన్నారు. నిజాలను నిర్భయంగా రాసే 'సాక్షి'పై దాడి చేస్తారా అంటూ ప్రశ్నించారు. దాడిని నిరశిస్తూ గురువారం జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో పల్నాడు జిల్లా ప్రెస్, నరసరావుపేట, ఇతర జర్నలిస్టు సంఘాల ఆధ్వర్యంలో ఆర్డీఓ, కలెక్టర్ కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు, కలెక్టర్ కార్యాలయంలో డీఆర్‌ఓ ఏకా మురళికి వినతిపత్రాలు అందజేశారు. అనంతరం సీపీఐ జిల్లా కార్యదర్శి కాసా రాంబాబు మాట్లాడుతూ వార్తలు రాశారనే ఉద్దేశ్యంతో పత్రికా కార్యాలయాలపై దాడులు చేయటం హేయమైన చర్య అన్నారు. జర్నలిస్టులపై దాడులు ఏమాత్రం భావ్యంకాదని, పత్రికా స్వేచ్ఛపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

చింతమనేనిని అరెస్టు చేయాలి..

దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం(పీడీఎం) రాష్ట్ర నాయకుడు వై.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సహజంగానే రౌడీయిజం చేస్తుంటాడని, చంద్రబాబు మెప్పుకోసమే ఈ దాడి చేశాడన్నారు. కూటమి ప్రభుత్వానికి కావాల్సింది ఇదేనన్నారు. వెంటనే ప్రభాకర్‌పై కేసు నమోదుచేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఎంఐఎం పట్టణ అధ్యక్షుడు షేక్ మౌలాలి మాట్లాడుతూ జర్నలిస్టులపై దాడులు బాధాకరమన్నారు. ఎమ్మెల్యే ప్రభాకర్ ఒక వీధి రౌడీ అని, మాటలు, చేష్టలు ఆవిధంగానే ఉంటాయన్నారు. పల్నాడులో బాధితులు చెప్పిన వాస్తవాలను రాసిన 'సాక్షి' విలేకర్లపై కేసులు పెట్టడం దారుణమన్నారు. ఎంసీపీఐయూ జిల్లా కార్యదర్శి రెడ్ బాష మాట్లాడుతూ పత్రికా స్వేచ్ఛను హరించే పద్ధతులను పూర్తిగా వ్యతిరేకిస్తుందన్నారు. ఎంఐఎం కరిముల్లా, వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు నంద్యాల జగన్‌మోహన్‌రెడ్డి, వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ జిల్లా బాధ్యులు బి.ప్రసాదు, పల్నాడు జిల్లా ప్రెస్‌క్లబ్, నరసరావుపేట అధ్యక్షుడు సీహెచ్.వి.రమణారెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో 'సాక్షి' స్టాఫ్ రిపోర్టర్ ఆర్.లవకుమార్‌రెడ్డి, షేక్ జిలాని, పి.కోటిరెడ్డి, జి.సాంబశివారెడ్డి, సుంకిరెడ్డి, నాగరాజు, బుచ్చిబాబు, అప్పారావు, శివ, స్వామి, షేక్ సాజిద్, పీడీఎం నాయకుడు నల్లపాటి రామారావు, బాదుగున్నల శ్రీను, బీసీ నాయకుడు బత్తుల వెంకటేష్, పీకేఎస్ నాయకుడు కంబాల ఏడుకొండలు పాల్గొన్నారు.

ప్రాణం తీసిన ఈత సరదా

- నేల బావిలో ఈతకు దిగి ఇద్దరు విద్యార్థులు మృతి
- మాచవరం మండలం కొత్తపాలెంలో ఘటన



ఏసురాజు (ఫైల్)




యశ్వంత్ (ఫైల్)



చిన్నారుల మృతదేహాలు

మాచవరం: వేసవి సెలవులు కావడంతో సరదాగా ఈతకు వెళ్లి నేల బావిలో కూరుకుపోయి ఇద్దరు చిన్నారులు మృతి చెందిన ఘటన మాచవరం మండలంలోని కొత్తపాలెం గ్రామం ఎస్సీ కాలనీలో గురువారం చోటుచేసుకుంది. వివరాల ప్రకారం గ్రామానికి చెందిన వేమవరపు శ్రీను కుమారుడు జస్వంత్ (9) స్థానిక దళితవాడలోని ప్రభుత్వ పాఠశాలలో 4వ తరగతి చదువుతున్నాడు. పప్పుల ఏసయ్య కుమారుడు యేసురాజు (16) మాచవరం జడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్నాడు. ఇరువురు మధ్యాహ్న సమయంలో సైకిల్ పై గ్రామ సమీపంలోని శివాలయం పక్కనే ఉన్న పెద్దబావి వద్దకు వచ్చి, దుస్తులు విడిచి ఈత కొట్టేందుకు బావిలోకి దూకారు. బావి లోతు ఎక్కువగా ఉండడంతో ఊపిరి ఆడక చనిపోయారు. కొంత సమయం తర్వాత గ్రామానికి చెందిన ఓ యువకుడు ఈత కొట్టేందుకు బావిలోకి దూకాడు. బావి అడుగు బాగాన ఇద్దరు చిన్నారులు మృతి చెందడాన్ని గమనించి, విషయాన్ని గ్రామస్తులకు తెలియజేసాడు. అప్పటికే చిన్నారులు కనిపించకపోవడంతో గ్రామంలో వెతుకుతున్న తల్లిదండ్రులకు విషయం తెలిసి ఘటనా స్థలానికి వచ్చి చూడగా దుస్తులు, సైకిల్‌ను గుర్తించి బోరున విలపించారు. గ్రామస్తుల సహాయంతో ఇద్దరు చిన్నారుల మృతదేహాలను బయటకు తీశారు. మృత దేహాలను చూసిన తల్లిదండ్రులు, బంధువులు కన్నీరు మున్నీరుగా విలపించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. గురజాల ప్రభుత్వ వైద్యశాల డాక్టర్ సాయి కర్ణకుమార్ ఘటనా స్థలంలోనే పోస్టుమార్టం నిర్వహించారు. చిన్నారుల తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ విజయ్ శేఖర్ తెలిపారు.

భావన్నారాయణ స్వామి దేవాలయం వారసత్వ బైలాస్‌కు శ్రీకారం



దేవాలయంలో ఇంటాక్ బృందం సభ్యులు

బాపట్ల: శ్రీభావన్నారాయణ స్వామి దేవాలయం దేవాలయ కట్టడాల పరిరక్షణకు అవసరమైన వారసత్వ బైలాస్ రూపొందిస్తున్నామని 'ఇంటాక్,' (ఇండియన్ నేషనల్ ట్రస్ట్ ఫర్ ఆర్ట్ అండ్ కల్చరల్ హెరిటేజ్) జాతీయ వారసత్వ డైరెక్టర్ ఎ.విజయ చెప్పారు. గురువారం ఢిల్లీ నుంచి వచ్చిన ఇంటాక్ బృందం దేవాలయాన్ని సందర్శించింది. ఇటువంటి చారిత్రక దేవాలయాల అద్భుత వారసత్వాన్ని కొనసాగించేందుకు ఆర్కిలాజికల్ సొసైటీ ఆఫ్ ఇండియా వారితో కలిసి కృషి చేస్తున్నట్లు ఆమె తెలిపారు. దేవాలయం చుట్టూ 100 మీటర్ల పరిధిలో ఉన్న పలు వారసత్వ కట్టడాలను వారు సందర్శించారు. ఇందులో భాగంగా శ్రీపాద, నోరి, కంభంపాటి, దేశరాజు వారి భవనాలను వారు పరిశీలించారు. దేవాలయంతో పాటు, మిగతా వాటిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందని ఆమె వివరించారు. ఇంటాక్ బృందంలో విజయతో పాటు, ఆర్కిటెక్ కన్జర్వేషనిస్ట్ దీప్తి శర్మ, ఇంటాక్ రాష్ట్ర కన్వీనర్ ఎస్వీఎస్ లక్ష్మీనారాయణ, ఆర్కిలాజికల్ సొసైటీ ఆఫ్ ఇండియాకు చెందిన డి.ఫణీంద్రలు ఉన్నారు. వారికి ఇంటాక్ బాపట్ల జిల్లా కన్వీనర్ డాక్టర్ పీసీ సాయిబాబు స్వాగతం పలికారు. బృందం సభ్యులని ఫోరం ఫర్ బెటర్ బాపట్ల ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఫోరం సభ్యులు జి.వెంకటేశ్వర్లు, ఎం.నరసింహారావు, దేవాలయ వంశపారంపర్య ధర్మకర్త దేశిరాజు రమణబాబు, శ్రీరామచంద్రమూర్తి, ఉమాదేవి, రాజేష్, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ నిత్యాన్నదానానికి ఇబ్రహీంపట్నం సమీపంలోని గుంటుపల్లికి చెందిన జి.మధుకిరణ్ కుటుంబం రూ. 1,00,116 విరాళాన్ని అందజేసింది.

క్లుప్తంగా

26 నుంచి ఎద్దుల బల ప్రదర్శన పోటీలు



రెంటచింతల: రెండు తెలుగు రాష్ట్రాల స్థాయిలో ఎద్దుల బండలాగుడు బల ప్రదర్శన పోటీలు ఈ నెల 26వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు శుభోదయ యువజన సంఘం అధ్యక్షుడు గాదె జయభారత్ రెడ్డి తెలిపారు. గురువారం రెంటచింతలలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం సూర్యాపేట మండలం మఠంపల్లి గ్రామంలో 25వ తేదిన జరిగే శుభవార్త దేవాలయ తిరునాళ్ల సందర్భంగా మాంట్ ఫోర్ట్ స్కూల్ (బ్రదర్స్ స్కూల్) ఆవరణలలో ఈ పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. ఆసక్తి కలిగినవారు ఈ నెల 25వ తేదీలోపు పేరు నమోదు చేసుకుని ఎంట్రీ ఫీజు రూ. 1000 చెల్లించాలన్నారు. మరిన్ని వివరాలకు 96187 64924, 99896 96953, 99497 62633 ఫోను నంబర్లను సంప్రదించాలని కోరారు. సమావేశంలో యువజన సంఘం సభ్యులు గాదె పవన్‌రెడ్డి, తానం బాలరెడ్డి, కందుల కిరణ్ కుమార్‌రెడ్డి, సలిబండ్ల రాజేష్‌రెడ్డి, కొమ్మారెడ్డి రంజిత్‌రెడ్డి, గోపు అఖిల్‌రెడ్డి, గాదె మనీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ మహిళలకు ఉచిత శిక్షణ

నరసరావుపేట ఈస్ట్: జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ, నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (ఎన్‌ఏసీ), ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలోఎస్సీ మహిళలకు ఉచిత టైలరింగ్, కంప్యూటర్ కోర్సులపై 3 నెలలు పాటు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఈ.తమ్మాజీరావు, ఎన్‌ఏసీ ఏడి వి.నరసింహారావు గురువారం తెలిపారు. కలెక్టరేట్ సమీపంలోని ఎన్‌ఏసీ ట్రెనింగ్ సెంటర్‌లో మే 1వతేదీ నుంచి ఆయా విభాగాలలో శిక్షణ ప్రారంభమవుతుందని వివరించారు. ఆసక్తి గల ఎస్సీ మహిళలు తమ ఆధార్, కుల ధృవీకరణ, విద్యార్హతల సర్టిఫికెట్లు, రెండు పాస్‌పోర్టు ఫొటోలు, ఆధార్‌తో లింక్ అయిన ఫోన్‌తో ఎన్‌ఏసీ కేంద్రానికి వచ్చి తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. వివరాలకు 9394102075, 9985496190 నెంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

ఉచిత ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

నరసరావుపేట ఈస్ట్: విద్యాహక్కు చట్టం కింద ప్రైవేటు పాఠశాలల్లో 2025–26 విద్యా సంవత్సరానికి 1వ తరగతిలో చేరేందుకు అర్హులైన పేదలకు 25 శాతం సీట్లు కేటాయించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ, సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ వి.సుబ్బారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన చిన్నారుల తల్లిదండ్రులు ఈనెల 28 నుంచి మే నెల 15వతేది వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తులను http://creap.gov.in వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని వివరించారు. వివరాలకు ఆయా మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో సంప్రదించాలన్నారు. అలాగే జిల్లా కేంద్రంలో డిఈఓ కార్యాలయంలో నోడల్ అధికారిగా సిఎంఓ పి.పద్మారావు, హెల్ప్ డెస్క్‌లో ఏపీఓ శంకరరాజును నియమించినట్లు తెలిపారు. వివరాలకు 4849851047, 9963192485 నెంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

వాహనాలకు భద్రత... జీపీఎస్

గుంటూరు నగరంలోని కొత్తపేటకు చెందిన ఒక యువకుడి ద్విచక్ర వాహనాన్ని ఇటీవల కాలంలో కొంత మంది ఆకతాయిలు తీసుకువెళ్ళారు. ఆ వాహనదారుడు ఇంట్లోకి వెళ్ళే సమయంలో తన బైక్‌కు తాళం వేయటం మరిచిపోయాడు. వాహనాన్ని తీసుకు వెళ్ళిన ఆకతాయిలు... వారికి కావాల్సినంత సేపు తిరిగి తిరిగి పొన్నూరు రోడ్డులో వదిలి వెళ్ళారు. అయితే సదరు యువకుడు మాత్రం ఎటువంటి కేసు పెట్టలేదు. అందుకు కారణం తన బైక్‌లో గ్లోబల్ పొజిషినింగ్ సిస్టం (జీపీఎస్) ఉండటమేన్. చివరకు జీజీఎస్ ట్రాకింగ్ సిస్టమ్ ద్వారా తన వాహనం వదిలేసిన ప్రాంతానికి వెళ్లి తెచ్చుకున్నాడు.

పాత గుంటూరుకు చెందిన ఒక పురోహితుడు తన కారును వేరే వ్యక్తికి కొద్ది రోజులు వాడుకునేందుకు ఇచ్చాడు. అయితే కారు తీసుకున్న వ్యక్తి అసలు తనకు కారు ఇవ్వలేదని అడ్డం తిరిగాడు. ఇప్పటికీ ఆ కారు జాడ తెలియలేదు. రూ. 20లక్షలు విలువ చేసే కారుకు జీపీఎస్ లేకపోవటమే అందుకు కారణం. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఎటువంటి ప్రతిఫలం కనపడలేదు.

- మన వాహనం ఎక్కడ ఉన్నా... ఇట్టే తెలుసుకోవచ్చు
- ఎటువంటి భయం లేకుండా నిశ్చింతగా ఉండొచ్చు
- వాహనదారులకు ఎంతో మేలు చేకూర్చే జీపీఎస్ ట్రాకింగ్ సిస్టమ్





జీపీఎస్ ట్రాకింగ్ సిస్టమ్ పరికరాలు

పట్నంబజారు(గుంటూరుఈస్ట్) : వాహనాలకు జీపీఎస్ ట్రాకింగ్ సిస్టమ్‌ఎంతో ఉపయోగకరం. రూ.లక్షలు పెట్టి కార్లు, ద్విచక్ర వాహనాలు కొనుగోలు చేసే ప్రతి ఒక్కరూ జీపీఎస్‌ను తప్పని సరిగా సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం ఉందని పై రెండు ఉదాహరణలు రుజువు చేస్తున్నాయి. గుంటూరు నగరంలో సుమారు 1లక్ష 40వేల బైకులు, 40వేలకు పైగా కార్లు ఉన్నట్లు అధికారులు గణాంకాలు చెబుతున్నారు. అయితే ఎటువంటి చోరీ జరిగినా.. ఇంట్లో చిన్నారులు తెలియకుండా వాహనాన్ని తీసుకుని వెళ్ళినా.. ఫైనాన్స్ వారు తీసుకు పోయిన మన వాహన జాడ తెలుసుకునేందుకు ఎంతగానో ఉపయోగపడే పరికరం జీపీఎస్. ఈ పరికరాన్ని వాహనాలకు ఏర్పాటు చేస్తే.. దొంగల బారి నుంచి కాపాడుకునే అవకాశాలు మెండుగా ఉన్నాయని పోలీసులు సైతం సూచిస్తున్నారు. ఇటీవల కాలంలో నివాసం ముందు పెట్టిన బైక్‌లు, ఆటోలు చోరీకి గురౌతున్న పరిస్థితులు ఉన్నాయి.

ఎక్కడ ఉన్నా... అరచేతిలోనే...

వాహనదారులు జీపీఎస్‌ను అమర్చటం ద్వారా సెల్‌ఫోన్‌లో వారి వాహనాన్ని గుర్తించే అవకాశం ఉంది. జీపీఎస్ ట్రాకింగ్ సిస్టం వాహనానికి అమర్చిన తరువాత మన సెల్‌ఫోన్‌కు యాప్ ద్వారా అనుసంధానం చేస్తారు. తద్వారా వాహనం ఏ రూటులో వెళ్తుతోంది. ఎక్కడ దాకా వెళ్లింది, ఎటువంటి వైపు నుంచి వస్తోందో అనే సమాచారం ఇట్టే తెలిసిపోతుంది. ఒకవేళ చోరీకి పాల్పడిన వ్యక్తులైన జీపీఎస్ ట్రాకింగ్ సిస్టమ్‌ను పసిగట్టలేని పరిస్థితి ఉంటుంది. వాహన అంతర్భాగంలో జీపీఎస్‌ను అమర్చబడుతుంది. తద్వారా చోరీకి గురైన వాహనాన్ని కూడా ఇట్టే పట్టేయచ్చు.

ఎంతో మేలు చేకూరుస్తుంది...



వాహనాల్లో జీపీఎస్ ఏర్పాటు వల్ల యజమానికి ఎంతో మేలు చేకూస్తుంది. తద్వారా వాహనదారుడికి ఎనలేని భద్రత ఉంటుంది. నేరస్తులు తీసుకు వెళ్ళినా.. ఎక్కడైనా దాచిపెట్టినా.. వాహన కదలికలు మనకు తక్షణమే తెలిసిపోతాయి. ప్రతి వాహనానికి యజమానులు తప్పనిసరిగా జీపీఎస్ పరికరాన్ని అమర్చుకోల్సిన అవసరం ఉంది. మనకు తెలియకుండా ఎవరైనా వాహనం తీసిన వెంటనే సెల్‌ఫోన్‌కు మెసేజ్ రావటంతో పాటు, తక్షణమే మనం అప్రమత్తం అయ్యే అవకాశం ఉంటుంది. వాహనదారులు జీపీఎస్ అమర్చుకోవటం ద్వారా చోరీలను నియంత్రించే అవకాశం కూడా ఉంది.

– ఎం. రమేష్, డీఎస్పీ, ట్రాఫిక్, గుంటూరు

ఐపీ పెట్టిన బంగారం వ్యాపారి



పెరుమాళ్ల రాజేష్ పంపించిన నోటీసు

పిడుగురాళ్ల: వ్యాపారులకు బంగారం బిస్కెట్ ఎరగా చూపించి సుమారు రూ. 150 కోట్లకు మోసగించిన పెరుమాళ్ల రాజేష్‌పై ఆరోపణలు వస్తున్నాయి. ఆయన ఆడియో కూడా సోషల్ మీడియాలో వైరల్ కావటం, హవాలాలో డబ్బులు ఉన్నాయని, రాగానే ఇస్తానని చెప్పటంతో బాధితులు కొంత కాలం ఆగారు. తీరా ఇప్పుడు ఐపీ నోటీసులు చేతికి రావటంతో అందరు లబోదిబోమంటున్నారు. బిస్కెట్ వ్యాపారి పెరుమాళ్ల రాజేష్ ఈ నెల 12వ తేదీన ఐపీ నోటీసులను వ్యాపారులకు పంపించారు. సుమారు 63 మంది వ్యాపారులకు ఇవి అందించినట్లు సమాచారం. రాజేష్‌కు దుబాయిలో బిస్కెట్ సిండికేట్‌తో సంబంధం లేదని, విజయవాడలో కొనుగోలు చేసి పథకం ప్రకారం తక్కువ ధరకు బిస్కెట్‌లు ఇచ్చి పెద్ద మొత్తంలో వసూలు చేశాడని సమాచారం.

హత్య కేసులో ఒకరికి జీవిత ఖైదు

నరసరావుపేటటౌన్: వివాహేతర సంబంధం నేపథ్యంలో వ్యక్తిని హతమార్చినట్లు నేరం రుజువు కావడంతో నిందితుడు ప్రకాశం జిల్లా బల్లికురవ మండలం వేమవరం గ్రామానికి చెందిన వడితే నాగేశ్వరరావు నాయక్ కు జీవిత ఖైదు, పదివేల రూపాయలు జరిమానా విధిస్తూ 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎస్. సత్యశ్రీ గురువారం తీర్పు వెలువరించారు. హతుడు షేక్ ఖాదర్ బాబా(32) నిందితుడు నాగేశ్వరావు నాయక్ లది ఒకే గ్రామం. ఖాదర్ బాబా చిలకలూరిపేట మండలం మురికిపూడి గ్రామంలో చికెన్ షాపు నిర్వహిస్తూ జీవిస్తుంటాడు. ఈ నేపథ్యంలో మురికిపూడికి చెందిన ఓ మహిళతో ఆయన సన్నిహితంగా ఉంటున్నాడు. సదరు మహిళతో నిందితుడు నాగేశ్వరరావునాయక్ కూడా గతంలో సన్నిహితంగా మెలిగాడు. సదరు మహిళతో ఖాదర్ బాబా పరిచయం అయిన పిదప ఆమె నిందితుడు నాగేశ్వరరావునాయక్ ను దూరంగా పెట్టింది. కక్ష పెంచుకొని 2019 జులై 23వ తేదీ రాత్రి సమయంలో మురికిపూడి గ్రామంలో చికెన్ షాప్ లో నిద్రిస్తున్న ఖాదర్ బాబాను నాగేశ్వరరావు కత్తితో మెడ భాగంలో నరికి హతమార్చాడు. ఈ మేరకు మృతుడి భార్య షేక్ షాహిన పోలీసులకు ఫిర్యాదు చేసింది. దర్యాప్తు అనంతరం నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు కోర్టులో అభియోగ పత్రం దాఖలు చేశారు. విచారణలో నేరం రుజువుకావడంతో పై విధంగా కోర్టు తీర్పు వెలువడింది. ప్రాసిక్యూషన్ ఏపీపీ దేశి రెడ్డి మల్లారెడ్డి నిర్వహించారు.

వైద్య కళాశాలలో వెల్‌నెస్ క్లీనిక్ ప్రారంభం



క్లీనిక్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ రాజునాయుడు, పక్కన డాక్టర్ సుందరాచారీ, డాక్టర్ ప్రభాకర్

గుంటూరు మెడికల్: గుంటూరు వైద్య కళాశాలలో ఫిజియాలజీ విభాగం వద్ద గురువారం వెల్‌నెస్ క్లీనిక్‌ను ప్రారంభించారు. గుంటూరు జీజీహెచ్ మాజీ సూపరింటెండెంట్, సీనియర్ క్యాన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ దేవన బోయిన శౌరిరాజునాయుడు ముఖ్య అతిథిగా విచ్చేసి వెల్‌నెస్ క్లీనిక్‌ను ప్రారంభించారు. వైద్య కళాశాలలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను అభినందించారు. కళాశాల అభివృద్ధికి డాక్టర్ సుందరాచారీ చేస్తున్న కృషిని కొనియాడారు. కళాశాలలో వైద్యులు, వైద్య సిబ్బందికి పలు రకాల వైద్య పరీక్షలు, చికిత్సలు ఉచితంగా అందించేందుకు వెల్‌నెస్ క్లీనిక్ ఏర్పాటు చేశామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుందరాచారీ తెలిపారు. ప్రతిరోజూ పీజీ వైద్యులు వెల్‌నెస్ క్లీనిక్‌లో అందుబాటులో ఉండి సేవలందిస్తారన్నారు. ఉచిత క్లీనిక్ సేవలను కళాశాల సిబ్బంది వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ శ్రీధర్, డాక్టర్ ప్రభాకర్, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయితో పట్టుబడిన ఇద్దరు యువకులు

సుమారు 300 గ్రాముల గంజాయి స్వాధీనం



యువకుల నుంచి స్వాధీనం చేసుకున్న గంజాయి, రోల్స్

మంగళగిరి టౌన్: మంగళగిరి రైల్వేస్టేషన్ సమీపంలో ఇద్దరు యువకులు గంజాయి కలిగి ఉన్నారని సమాచారం రావడంతో గురువారం 'ఈగల్' టీమ్ పట్టణ పోలీసుల సహకారంతో అదుపులోకి తీసుకున్నారు. ఈగల్ విభాగాధిపతి ఆకే రవికృష్ణ ఆదేశాల మేరకు ఈగల్‌టీమ్ గురువారం మధ్యాహ్నం ఆ యువకులు అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి సుమారు 200 నుంచి 300 గ్రాముల వరకు గంజాయిని, గంజాయిని వినియోగించే త్రైస్ అనే పేరు కలిగిన రోల్స్‌ను స్వాధీనం చేసుకుని పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఆ యువకుల్ని విచారించగా మంగళగిరిలో ఓ యువకుడి వద్ద కొన్నామని, అతని వద్ద సుమారు 4 కిలోల వరకు గంజాయి ఉందనే సమాచారం ఇచ్చినట్లు తెలిసింది.

గంజాయి కేసులో ముగ్గురు నిందితులకు జైలు

బాపట్ల: గంజాయి కేసులో ముగ్గురికి మూడేళ్ల జైలు శిక్ష, పదివేలు జరిమానా విధిస్తూ గుంటూరు మొదటి అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి వి.ఏ.ఎల్ సత్యవతి గురువారం తీర్పు చెప్పారు. బాపట్ల జిల్లా చందోలు పోలీసుస్టేషన్ పరిధిలోని రసూల్‌పేటకు చెందిన షేక్ నజీర్‌బాషా నివాసంలో 2017 నవంబరు 19న అప్పటి చందోలు ఎస్ఐ చెన్నకేశవులు దాడులు నిర్వహించగా 470 గ్రాములు గంజాయి దొరికిందని కేసు నమోదు చేశారు. ఈమేరకు విచారణ చేపట్టిన ఈ కేసులో నజీర్‌బాషా, మారెడ్డి రోహిత్‌కుమార్‌రెడ్డి, సుబ్రహ్మణ్యంలకు శిక్షపడింది. గుంటూరు మొదటి అదనపు జిల్లా కోర్టులో కేసు విచారణకు రాగా జిల్లా ఎస్పీ తుషార్ డూడీ ఆదేశాల మేరకు బాపట్ల డీఎస్పీ రామాంజనేయులు సూచనలతో బాపట్ల రూరల్ సీఐ హరికృష్ణ పర్యవేక్షణలో చందోలు ఎస్సై శివకుమార్, కోర్ట్ లైజనింగ్ ఏఎస్ఐ ఉప్పల భాస్కర్ ద్వారా సాక్షులను కోర్టులో హాజరుపరిచారు. కోర్టు ఏపీపీ వజ్రాల రాజశేఖర్‌రెడ్డి వాదనలు వినిపించి ముద్దాయిలపై మోపబడిన నేరాన్ని తగిన సాక్ష్యాలతో రుజువు చేయడంతో గుంటూరు మొదటి అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి వి.ఏ.ఎల్ సత్యవతి గురువారం ముగ్గురు నిందితులకు 3 సంవత్సరాల జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ. 10,000 నగదు జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. ఈమేరకు ఎస్పీ తుషార్ డూడీ పోలీసులను అభినందించారు.

ఆటో బోల్తా.. మహిళ మృతి

చినగంజాం : ఆటో అదుపు తప్పి బోల్తా కొట్టడంతో ఓ మహిళ మృతి చెందగా మరో ముగ్గురికి గాయలైన సంఘటన చినగంజాం మండల పరిధిలోని తిమ్మసముద్రం సైఫన్ వద్ద చోటు చేసుకుంది. పోలీసులు అందించిన సమాచారం ప్రకారం మండలంలోని కడవకుదురు గ్రామానికి చెందిన పలువులు మహిళా కూలీలు ఇంకొల్లు మండల పరిధిలోని పావులూరు గ్రామంలో మిర్చి పంట పనులకు గత మూడు నెలలుగా ప్రతి రోజు వెళుతున్నారు. రోజు మాదిరిగానే కడవకుదురు గ్రామం నుంచి గురువారం ఉదయం 5 గంటల ప్రాంతంలో బయలుదేరి వెళుతున్న వారి ఆటో ఇంకొల్లు రోడ్డులోని తిమ్మసముద్రం సైఫన్ వద్దకు వెళ్ళే సరికి ఆటో హ్యాండిల్ అకస్మాత్తుగా బిగుసుకొని పోవడంతో పక్కనే కుడివైపు ఉన్న పొలాల్లోకి దూసుకొని వెళ్ళి బోల్తా కొట్టింది. ఆ సంఘటనలో నలుగురికి గాయాలు కాగా వారిలో నక్కల సోవమ్మ (79)ను తీవ్ర గాయలు కావడంతో 108 వాహనంలో వైద్యశాలకు తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందింది. ఆమెతో పాటు ప్రయాణిస్తున్న బత్తుల కమలమ్మ తలకు గాయం కాగా ఒంగోలు కిమ్స్‌కు, కొండేపు శేషమ్మ, డ్రైవర్ గొల్లపూడి వెంకటేశ్వర్లుకు గాయాలు కావడంతో వైద్యచికిత్స నిమిత్తం చీరాల తరలించారు. బాధితురాలు కొండేపు శేషమ్మ అందించిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శీలం రమేష్ తెలిపారు.

వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా కోటిరెడ్డి

పట్నంబజారు(గుంటూరుఈస్ట్) : వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గుంటూరు పశ్చిమ నియోజకవర్గానికి చెందిన తియ్యగూర కోటిరెడ్డిని గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ ఆదేశాలు వెలువడ్డాయి. ఈ మేరకు గురువారం కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ చేశారు.

ఎంప్లాయిస్, పెన్షనర్స్ విభాగం అధ్యక్షుడిగా సాదం

పట్నంబజారు(గుంటూరుఈస్ట్) : వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గుంటూరు పశ్చిమ నియోజకవర్గానికి చెందిన సాదం వెంకటసత్యనారాయణను పార్టీ జిల్లా ఎంప్లాయిస్ అండ్ పెన్షనర్స్ విభాగం అధ్యక్షులుగా నియమిస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ మేరకు గురువారం కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి.

వైద్య కళాశాలలో స్పోర్ట్స్ డే



గుంటూరు మెడికల్: గుంటూరు వైద్య కళాశాలలో వైద్య విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు స్పోర్ట్స్ డే సందర్భంగా గురువారం పలు క్రీడలను గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.వి.సుందరాచారీ లాంచనంగా ప్రారంభించారు. వారం రోజులపాటు జరుగనున్న క్రీడల్లో క్రికెట్, షటిల్, చెస్, ఇండోర్, అవుట్‌డోర్ గేమ్స్ జరుగనున్నాయి. ఎంబీబీఎస్, పీజీ వైద్య విద్యార్థులకు క్రీడలు నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ శ్రీధర్, డాక్టర్ ప్రభాకర్, స్పోర్ట్స్ పీఈటీ రాము, డాక్టర్‌భరత్, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి కేసులో నిందితులకు మూడేళ్ల జైలు

గుంటూరు లీగల్: చందోలు పోలీసులు 2017లో నమోదు చేసిన కేసులో నిందితులకు జైలు శిక్ష విధిస్తూ గుంటూరు 1వ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి వి.ఎ.ఎల్. ఔ. సత్యవతి బుధవారం తీర్పు వెలువరించారు. బాపట్ల రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సి.హెచ్.కోటేశ్వరరావుకు చందోలు గ్రామం రసూల్‌పేటలో గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో తన సిబ్బందితో దాడి చేశారు. గంజాయి విక్రయిస్తున్న షైక్ నజీర్ బాషా, కొనుగోలు చేస్తున్న చుండూరు మండలం దుండిపాలెంకు చెందిన మారెడ్డి రోహిత్ కుమార్ రెడ్డిని అరెస్ట్ చేశారు. 520 గ్రాముల గంజాయి, రూ. వెయ్యి నగదు స్వాధీనం చేసుకున్నారు. నజీర్ బాషా ప్రకాశం జిల్లా తిమ్మాసముద్రానికి చెందిన కర్ణం సుబ్బారావు వద్ద గంజాయి కొనుగోలు చేస్తున్నట్లు తేలడంతో సుబ్బారావు నుంచి 4,050 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. తర్వాత అతడిని అరెస్ట్ చేశారు. కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేయగా, విచారణ పూర్తిచేసి నిందితులకు మూడు సంవత్సరాల జైలు శిక్ష, రూ. 10 వేల జరిమానా విధించారు. ప్రాసిక్యూషన్ తరపు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వజ్రాల రాజశేఖర్ రెడ్డి వాదనలు వినిపించారు.

క్రీడల్లోనూ విద్యార్థులు రాణించాలి

- పీఎం శ్రీ కేంద్రియ విద్యాలయ ఇన్‌చార్జి ప్రిన్సిపల్ కిరణ్ రెడ్డి
- హైదరాబాద్ రీజినల్ స్థాయి అండర్–17 బాలబాలికల వాలీబాల్ స్పోర్ట్స్ మీట్ ప్రారంభం



అండర్–17 బాలికల వాలీబాల్ పోటీలు

సత్తెనపల్లి: చదువుతోపాటు క్రీడల్లోనూ విద్యార్థులు రాణించాలని సత్తెనపల్లి పీఎం శ్రీ కేంద్రియ విద్యాలయ ఇన్‌చార్జి ప్రిన్సిపల్ బి. కిరణ్‌రెడ్డి అన్నారు. సత్తెనపల్లి లోని పీఎం శ్రీ కేంద్రియ విద్యాలయ ఆవరణలో హైదరాబాద్ 54వ రీజినల్ స్థాయి అండర్–17 బాల, బాలికల వాలీబాల్ స్పోర్ట్స్ మీట్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిన్నతనం నుంచే చదువుతో పాటు క్రీడలు, అన్ని రంగాల్లోనూ విద్యార్థులు రాణించాలన్నారు. క్రీడల వల్ల శారీరక ధృఢత్వంతో పాటు చురుకుదనం ఉంటుందన్నారు. క్రీడల్లో రాణించడం వల్ల ప్రత్యేక అవకాశాలు కూడా లభిస్తాయన్నారు. ఈ సందర్భంగా రెండు తెలుగు రాష్ట్రాల నుంచి అండర్–17 బాలికలు 8 జట్లు హాజరయ్యాయి. పీఎం శ్రీ కేంద్రియ విద్యాలయం సత్తెనపల్లి, వాల్తేరు, విజయవాడ–1, బొల్లారం, హక్కింపేట, ఖమ్మం, తెనాలి జట్లు హాజరు కాగా లీగ్ కం నాకౌట్ పద్ధతిలో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పీఎం శ్రీ కేంద్రియ విద్యాలయం సత్తెనపల్లి, వాల్తేరు, ఖమ్మం, తెనాలి జట్లు సెమీఫైనల్‌కు చేరుకున్నాయి. శుక్రవారం సెమీఫైనల్స్ అనంతరం ఫైనల్ పోటీలు నిర్వహించనున్నారు. ఈ పోటీలకు రిఫరీలుగా ఎం. శేషశ్రీనివాసరావు, ఈ రవీంద్ర, ఎం. నరసింహారావు, షేక్ మహమ్మద్ రియాద్, పాలపర్తి గోవింద్, టీ.లక్ష్మీపతి వ్యవహరించారు. క్రీడా పోటీలను వీక్షించేందుకు క్రీడాకారులు, క్రీడాభిమానులు, పెద్ద ఎత్తున హాజరయ్యారు.

గ్రామాల అభివృద్ధికి పంచాయతీరాజ్ చట్టం దోహదం

నరసరావుపేట: గ్రామాలలో నిర్మాణాత్మక పురోగతి, మౌలిక వసతుల ఏర్పాటుకు పంచాయతీరాజ్ చట్టం ఎంతో ఉపయోగ పడుతుందని జిల్లా రెవెన్యూ అధికారి ఏకా మురళి పేర్కొన్నారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో పంచాయతీరాజ్‌శాఖ ఆధ్వర్యంలో జాతీయ పంచాయతీరాజ్ దిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న డీఆర్వో మాట్లాడుతూ ప్రతి సోమవారం నిర్వహించే గ్రీవెన్స్‌డేలో కూడా పంచాయతీలకు సంబంధించి ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. 73,74 యాక్ట్ ప్రకారం పంచాయతీరాజ్‌శాఖ చాలా పటిష్ఠంగా ఉందన్నారు. గ్రామ పంచాయతీలకు నిధులు అందించడం జరుగుతుందన్నారు. జిల్లా పంచాయతీ అధికారి ఎం.వీ.భాస్కరరెడ్డి మాట్లాడుతూ 73వ రాజ్యాంగ సవరణ ప్రకారం ప్రతి ఏడాది ఏప్రిల్ 24వ తేదీన పంచాయతీరాజ్ దినంగా నిర్వహించుకోవటం జరుగుతుందంటూ పంచాయతీరాజ్‌శాఖ ప్రాసస్త్యాన్ని వివరించారు. డిప్యూటి కలెక్టర్ శ్రీరాములు, జిల్లా విద్యా శాఖాధికారి చంద్రకళ, పంచాయతీరాజ్ ఎస్.ఈ పాల్గొన్నారు.

డ్రగ్స్ విక్రయిస్తున్న ముఠా అరెస్ట్

- పల్నాడు జిల్లా పిడుగురాళ్ల నుంచి తెచ్చి నల్లగొండలో విక్రయం
- వివరాలు వెల్లడించిన నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి

నల్లగొండ: నల్లగొండ పట్టణంలో డ్రగ్స్ విక్రయిస్తున్న ముఠాను అరెస్ట్ చేసి, వారి నుంచి 2400 స్పాస్మో ట్యాబ్లెట్లు, ఒక బైక్, రూ.22,000 నగదు, రెండు సెల్‌ఫోన్లు, మెడికల్ షాప్ లైసెన్స్ డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ తెలిపారు. ఈ కేసు వివరాలను ఎస్పీ ఆదేశాల మేరకు గురువారం నల్లగొండ వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో సీఐ రాజశేఖర్‌రెడ్డితో కలిసి డీఎస్పీ శివరాంరెడ్డి విలేకరులకు వెల్లడించారు. డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం ఉదయం 11గంటల సమయంలో నల్లగొండ మున్సిపాలిటీ పరిధిలోని మునుగోడు రోడ్డులో వన్ టౌన్ సీఐ ఏమిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ సందీప్ రెడ్డి, పోలీస్ సిబ్బంది వాహనాలు తనిఖీ చేస్తుండగా.. నల్లగొండ మున్సిపాలిటీ పరిధిలోని అక్కచెల్మ ప్రాంతానికి చెందిన మహ్మద్ ఖాజా వసీముద్దీన్ అలియాస్ వసీం అక్రం బైక్‌పై బ్యాగుతో అనుమానాస్పదంగా కనిపించడంతో అతడిని అదుపులోకి తీసుకున్నారు. బ్యాగును తనిఖీ చేయగా అందులో 288 మత్తు కల్గించే స్పాస్మో ట్యాబ్లెట్ షీట్లు లభించాయి. అతడి నుంచి ట్యాబ్లెట్ షీట్లతో పాటు బైక్, సెల్‌ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వసీముద్దీన్‌తో పాటు అక్కచెల్మ ప్రాంతానికే చెందిన అతడి స్నేహితులు ఖాజా షోయబ్, షేక్ అమేర్ కొంతకాలంగా స్పాస్మో ట్యాబ్లెట్స్ వినియోగిస్తూ వాటికి బానిసయ్యారని డీఎస్పీ పేర్కొన్నారు. స్థానికంగా మెడికల్ షాపుల్లో ఈ స్పాస్మో ట్యాబ్లెట్లు అమ్మట్లేదని తెలుసుకుని, వీరు ముగ్గురు గత ఆరు నెలల నుంచి ఏపీలోని పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో ఛాయా మెడికల్ షాప్ నిర్వాహకుడు కొప్పురవారి యశ్వంత్ మణిదీప్ శ్రీనివాసరావు దగ్గరకు బైక్‌పై వెళ్లి స్పాస్మో ట్యాబ్లెట్లు కొనుగోలు చేస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. ఒక్కో షీట్‌ను రూ.100కు కొని వారి అవసరం మేరకు వినియోగించగా.. మిగిలిన ట్యాబ్లెట్లను ఒక్కో షీట్ రూ.180కు అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారని పేర్కొన్నారు. పట్టుబడిన వసీముద్దీన్‌ను తీసుకొని పిడుగురాళ్లకు వెళ్లి ఛాయా మెడికల్ షాప్ నిర్వాహకుడు మణిదీప్ శ్రీనివాసరావును పట్టుకున్నట్లు తెలిపారు. అతడి వద్ద నుంచి 15 షీట్ల స్పాస్మో ట్యాబ్లెట్లు, సెల్‌ఫోన్, మెడికల్ షాపు లైసెన్స్ డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ వివరించారు. వసీముద్దీన్, మణిదీప్ శ్రీనివాసరావును రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఖాజా షోయబ్, షేక్ అమేర్ పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు. నిందితులను పట్టుకున్న వన్ టౌన్ సీఐ ఏమిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, ఎస్ఐలు శంకర్, సందీప్‌రెడ్డి, కానిస్టేబుళ్లు రబ్బాని వెంకటనారాయణ, కిరణ్, షకీల్, శ్రీకాంత్, సైదులును ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అభినందించారు.

మహిళలు చదువుకోవాలి

డీఆర్‌ఓ గంగాధర్‌గౌడ్

బాపట్ల: జిల్లాలోని డ్వాక్రా మహిళా సంఘాలలో ఉన్న చదువురాని మహిళలకు, అంగన్‌వాడీ ఆయాలు, పాఠశాలల్లో పనిచేసే వంటవారు, సహాయకులకు సాంకేతిక అక్షరాస్యతను అందించేందుకు చేపట్టిన ఉల్లాస్ కన్వర్జెన్స్ సమావేశంలో డీఆర్‌ఓ గంగాధర్‌గౌడ్ పాల్గొన్నారు. గురువారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో డీఆర్వో మాట్లాడుతూ మొదటి విడతగా 15268 మంది నమోదు చేసుకోగా రెండో విడతలో 31228 చదువురాని వారు ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. మహిళలు చదువుకోవాలని సూచించారు.